

# పంజాయితీ రాజ్ సంస్థల్లో రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణే బిసిలకు రక్ష

e-mail: kkrao999@yahoo.co.in

కె. కొండలరావు
హైకోర్టు న్యాయవాది
కన్వీనర్ "బిసి మిత్రులు"
సెల్: 9849433644

"మీకు గుండె ధైర్యం ఇచ్చే దానికే ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. యాభై శాతం రిజర్వేషన్లను మహిళలకు ఇస్తుంది", అని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ఎంతో ఆర్భాటంగా, గుండె నిబ్బరంతో ఎలక్ట్రానిక్ మీడియాలో నిత్యం ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఆయనగాని, ఇతర మంత్రులుగాని, పంచాయితీరాజ్ సంస్థల్లో బి.సి.ల రిజర్వేషన్ల గురించి, ఒక ఖచ్చితమైన విధానపర ధోరణితో, ధీమాగా ఎందుకు ప్రకటన చేయలేకపోతున్నారు? సంధిగ్ధతతో ఎందుకు తడబడుతున్నారు? కీలక వాస్తవాలను మరుగున పెట్టి, బి.సి.లను మభ్యపెట్టి, కప్పదాటు ధోరణితో , పొంతన స్పష్టత లేని పరస్పర విరుద్ధ ప్రకటనలతో వీరు ఎందుకు వ్యవహరిస్తున్నారు?

తీవ్రమైన ఉద్యమ ఒత్తిడి ఏమీలేకపోయినా, రాజ్యాంగం స్పష్టంగా నిర్ధేశించకపోయినా, చట్టాన్ని కూడా సవరించకుండా, కేవలం సంబంధించిన రూల్సుని మాత్రమే సవరించి, 33.3 నుండి 50 శాతానికి మహిళా రిజర్వేషన్లను పెంచడంలో ప్రదర్శించిన ప్రగతిశీలతనుగాని, ఉదారత్వాన్ని గాని, సమాన హక్కుల పట్లనిబద్ధత చిత్తశుద్ధిని గాని ఈ ప్రభుత్వం బి.సి.ల పట్ల ఎందుకు ప్రదర్శించలేకపోతుంది? బి.సి, ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆయా వర్గాలు పొందుతున్న రిజర్వేషన్లలో 50 శాతం కేటాయించడంలో ఉన్న తర్కబద్ధత, ఆవశ్యకత, న్యాయం "ఓపెన్ కేటగిరి అవకాశాల్లో" కూడా మహిళలకు 33.3 నుండి 50 శాతానికి పెంచడంలో కనిపించవు. ఇక్కడ సహేతుకత కంటే, అగ్రకులాల ఆధిపత్యం కొనసాగింపు ఎత్తుగడే స్పష్టంగా కనిపిస్తుంది.

ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాల మహిళలు, ఆధిపత్య కులాల మహిళలతో పోటీపడి "ఓపెన్ కేటగిరీ మహిళా రిజర్వేషన్" అవకాశాల్లో నెగ్గుకు రాగలగడం దుర్లభం. ఈ అవకాశాలు మొత్తం ఆధిపత్య కులాల మహిళల సొంతం కావడం ఖాయం. పార్లమెంట్ నుండి పంచాయితి వరకు అన్ని స్థాయిల రాజ్యాధికారం పై ఇంతకాలం గుత్తాధిపత్యం చలాయించింది ఆధిపత్య కులాలు. అయితే లింగ వివక్ష కారణంగా వీరి మహిళలు తగినంత ప్రాతినిధ్యం పొందలేకపోతున్న సమస్యకు పరిష్కారంగా రాజ్యాంగం నిర్దేశించిన కనీస స్థాయి 33.3 శాతం రిజర్వేషన్లకు పరిమితం చేయకుండా ఎస్సీ, ఎస్టీ, బిసి మహిళా రిజర్వేషన్ల స్థాయికి సమానంగా ఓపెన్ కేటగిరీలో కూడా మహిళా రిజర్వేషన్లను 50 శాతానికి పెంచడం ఆధిపత్య శక్తుల కుయుక్తి కాదా? లింగ వివక్షను సామాజిక వివక్షను ఒకే గాట కట్టడం సమంజసమేనా? కాదు.

పంచాయితీ రాజ్ సంస్థల్లో అన్ని స్థాయిల్లోని అన్ని అవకాశాల్లో బిసి, ఎస్సీ, ఎస్టీల మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని ఈ సీలింగు పరిమితిని మదించే నిమిత్తం మహిళల రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకోరాదని సుప్రీంకోర్టు డాక్టరు కె. కృష్ణమూర్తి కేసులో, 11.05.2010 నాటి తన తీర్పులో చెప్పింది. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్‌తో సహా, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ప్రతివాదులుగా చేర్చడమే కాకుండా ఈ తీర్పును అన్ని రాష్ట్రాలకు సర్క్యులేట్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేగాక మొత్తం రిజర్వేషన్లు 50% మించిన రాష్ట్రాల్లో ఈ సీలింగ్ దాటకుండా ఉండడానికి బిసి రిజర్వేషన్లను ఆ మేరకు తగ్గిస్తూ ఆయా రాష్ట్రాలు తమ చట్టాలను మార్చుకోవలసి వస్తుందని సుప్రీంకోర్టు తన తీర్పులో ఎంతో స్పష్టంగా పేర్కొంది. ఇంతవరకు మీడియా ద్వారా ప్రజల ముందుకు రాని ఈ వాస్తవాల నేపథ్యంలో ఈ తీర్పు కర్ణాటక రాష్ట్రానికే వర్తిస్తుంది, 60.55% మొత్తం రిజర్వేషన్లు ఉన్నా ఆంధ్రప్రదేశ్‌కు వర్తించదంటూ, బిసిల 34 శాతం రిజర్వేషన్లను కొనసాగిస్తామంటూ మంత్రులు మాట్లాడడం, బిసిల్ని మభ్య పెట్టడానికి కాదా? ప్రస్తుత పరిస్థితుల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం సీలింగ్ దాటాయనే కారణంచేత, రాజ్యాంగ రక్షణలేని బిసిల 34 శాతం రిజర్వేషన్లు కోర్టులో సవాల్ చేయబడితే ఆ మేరకు అవి నిలిచే అవకాశం లేదని ప్రభుత్వానికి తెలియదని నమ్మేదెవరు?

www.bctimes.org

బిసిల అభివృద్ధి పట్ల, రాజకీయ న్యాయం పట్ల తనకు చిత్తశుద్ధి ఉన్నట్లు నమ్మబలుకుతున్న ప్రభుత్వం బిసిలకు జరగవలసిన రాజకీయ న్యాయానికి గండికొడుతూ సుప్రీంకోర్టు తీర్పు తెచ్చిన సమస్యకు పరిష్కారంగా రాజ్యాంగ సవరణకోసం ప్రయత్నించకుండా కనీసం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషను కూడా వేయకుండా ఒక సంవత్సరం కిమ్మనకుండా కూర్చుని ఎలక్షన్లు దగ్గర పడ్డ ఈ క్షణంలో, ఆ తీర్పు ఈ రాష్ట్రానికి వర్తించదని బుకాయించడం బిసిల్ని మోసం చేయడం కాదా? ప్రశ్నార్థకంగా మారిన బిసి రిజర్వేషన్ల విషయం గుట్టు విప్పకుండా ఒక సంవత్సరం కపట మౌనం పాటించిన ప్రభుత్వం చివరి క్షణంలో ఎటువంటి హడావిడీ లేకుండా మహిళా రిజర్వేషన్లను 50 శాతానికి పెంచడం ఏ వర్గ ప్రజల ప్రత్యేక ప్రయోజనాల కోసం?

సుప్రీంకోర్టు తీర్పులో బిసిల్ని ఇబ్బంది పెడుతున్న ప్రశ్నించదగిన కోణాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా రిజర్వేషన్ల 50 శాతం సీలింగుని సమర్థించే చర్చ (Ratio Decidendi) ఈ తీర్పులో ఎక్కడా లేదు. పంచాయితీరాజ్ సంస్థల్లో రిజర్వేషన్ల రాజ్యాంగ పునాది, విద్య, ఉద్యోగ రంగాల రిజర్వేషన్ల రాజ్యాంగ పునాదికి భిన్నమైందని, అందుచేత విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల సందర్భంగా ఉత్పన్నమైన సూత్రాలను, పంచాయితీరాజ్ సంస్థల్లో రిజర్వేషన్లకు యాంత్రికంగా అన్వయించకూడదని ప్రతివాదులు చేసిన వాదాన్ని ఆమోదిస్తున్నట్లు ఒక పక్క ప్రకటిస్తూనే ఎటువంటి చర్చా పునాది (Ratio Decidendi) లేకుండానే, కారణాలు చెప్పకుండానే విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల సందర్భంగా ఉత్పన్నమైన 50 శాతం రిజర్వేషన్ల పరిమితి సూత్రాన్ని యథాతథంగా, పూర్తి యాంత్రికంగా సుప్రీంకోర్టు తన తీర్పులో ప్రకటించింది. దీన్ని సవాలు చేసి ప్రశ్నించవచ్చు.

విద్య, ఉద్యోగ రంగ రిజర్వేషన్లలో బిసి, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఏ వర్గానికి ఎంత శాతం ఇవ్వాలి అనే విషయాన్ని రాజ్యాంగం సంబంధించిన ఆర్టికల్స్ 15(4), 16(4)లలో చెప్పకుండా రాష్ట్రాల నిర్ణయానికి విడిచి పెట్టేసింది. పంజాయితీరాజ్ సంస్థల్లో రిజర్వేషన్లను నియంత్రించే ఆర్టికల్ 243-డి దీనికి భిన్నంగా ఉంది. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు ఏ మేరకు ఇవ్వాలి అనే విషయాన్ని రాష్ట్రాల విచక్షణకు విడిచిపెట్టకుండా, వారి జనాభా దామాషా మేరకు ఉండాలని స్పష్టంగా చెప్పింది. విద్య, ఉద్యోగ రంగాల్లో మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లను నిర్దేశించిన రాజ్యాంగం పంచాయితీ రాజ్ సంస్థల్లో దామాషా మేరకు కాకపోయినా "సరిపోయేమేరకు" ఇచ్చే లక్ష్యంతో మూడవ వంతుకు తక్కువ కాకుండా మహిళలకు రిజర్వేషన్లు ఉండాలని ఆర్టికల్ 243-డి విపులీకరించింది. అయితే బిసిలకు ఏ మేరకు రిజర్వేషన్లు ఉండాలనే విషయాన్ని సంబంధించిన ఆర్టికల్ 243-డి (6) సూత్రప్రాయంగా కూడా సూచించికుండా పూర్తిగా రాష్ట్రాల విచక్షణకే విడిచిపెట్టేసింది. ఇక్కడే బిసిలకు దెబ్బతగిలింది. కోర్టుల భాష్యానికి, జోక్యానికి సావకాశం కల్పించింది. 73వ రాజ్యాంగ సవరణలోని ఈ లోపం బిసిల అభివృద్ధికి శాపమయ్యింది. బిసిల దామాషా ప్రాతినిధ్యానికి అడ్డంకిలేని విధంగా రక్షణకల్పిస్తూ 50 శాతం సీలింగ్‌ని నిర్వీర్యం చేస్తూ మరొక రాజ్యాంగ సవరణ తీసుకురావడం ఎంతో అవసరం.

మొదటి నుండి చట్ట సభలలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దామాషా రిజర్వేషన్లు కల్పించడానికి వీలు కల్పించిన రాజ్యాంగ నిర్మాణం బిసిల్ని పూర్తిగా విస్మరించింది. ఇపుడు ఎస్సీ, ఎస్టీ వర్గాలతో సహా ఓపెన్ కేటగిరి మహిళలకు కూడా పంచాయితీరాజ్ వ్యవస్థలో దామాషా రిజర్వేషన్లకు 73వ రాజ్యాంగ సవరణ అవకాశం కల్పిస్తున్నది. ఈ సవరణలోని అస్పష్టత బిసిల దామాషా హక్కుల్ని ప్రశ్నార్థకం చేసి వారి రాజకీయ పునాదుల్ని బలహీనపరచడానికి వీలు కల్పించింది.

తమంతట తాముగా సొంత శక్తితో దామాష హక్కులు సాధించుకోలేని బిసిల స్థితిగతులను పట్టించుకోని వైఖరితో తర్కానికి, రాజకీయ న్యాయానికి పొంతనలేని రీతిలో, బిసిల రిజర్వేషన్ల స్థాయి నిర్ణయం విషయం రాష్ట్రాలకు ఉన్న విచక్షణాధికారానికి కోర్టు విధించిన ఈ 50 శాతం సీలింగు రూలు యాంత్రికంగా పరిమితులు సృష్టించి బిసిల దామాషా హక్కులకు అడ్డం పడుతున్నది. బిసి రిజర్వేషన్ల స్థాయి, వారి స్థితిగతులను బట్టిగాక తర్క విరుద్ధంగా ఎస్సీ, ఎస్టీల సంయుక్త జనాభా మీద ఆధారపడేలా చేసి, ఆంధ్రప్రదేశ్‌లాంటి ఎన్నో రాష్ట్రాల్లో బిసిల రాజకీయ సాధికారతకు ఈ సీలింగ్ రూలు గండికొడుతుంది. ఇది ధర్మవిరుద్ధం.

www.bctimes.org

ప్రభుత్వం అధికారికంగా ఉపయోగించిన గణాంకాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ జనాభాలో 57.1 శాతం ఉండి సొంత శక్తితో ఆమేర అవకాశాలను సాధించుకోలేని నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, రాజ్యాంగంలో అస్పష్టతకు కోర్టు యాంత్రికంగా పెట్టిన 50 శాతం రూలు తోడై బిసిలు 23.4శాతం అవకాశాలకే పరిమితమయ్యే పరిస్థితులు సృష్టించబడ్డాయి. న్యాయస్థానం ఈ కోణాన్ని గమనంలోకి తీసుకోలేదు. బిసిలకు జరుగుతున్న ఈ అన్యాయం కొన్ని రాష్ట్రాల్లో ఇంకా దౌర్భాగ్యస్థాయిలో ఉన్నది. ఎస్సీ, ఎస్టీల మొత్తం జనాభా 53.65 శాతం ఉన్న "త్రిపుర"లో బిసిల రిజర్వేషన్లకు ఏమాత్రం సావకాశమే లేదు. ఉత్తరప్రదేశ్‌లో బిసిల జనాభా 59 శాతంగా ఉండి కూడా వారు 27 శాతం రిజర్వేషన్లకే పరిమితం చేయబడ్డారు. ఎస్సీ, ఎస్టీల సంయుక్త జనాభా 33.4 శాతం ఉన్న కారణంగా 43 శాతం జనాభా కలిగిన రాజస్థాన్ బిసిల రిజర్వేషన్ 16.6 శాతం దాటేవీలు లేదు. ఎస్సీ, ఎస్టీల జనాభా 30 శాతం ఉన్న కారణాన 60 శాతం జనాభా కలిగిన బీహార్ బిసిలు, 20 శాతం రిజర్వేషన్లకే పరిమితం కావల్సి వచ్చింది.

కర్ణాటకలో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు వరుసగా 15,3,33 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఇవి మొత్తం 51 శాతమవుతుంది. అక్కడ 84 శాతం రిజర్వేషన్లు ఉన్నాయని, సుప్రీం తీర్పు వాటికే వర్తిస్తుంది; ఈ రాష్ట్రానికి వర్తించదని ఒక దిన పత్రిక (సాక్షి కాదు)లో వచ్చిన ఒక బిసి నాయకుని ప్రకటనలో వాస్తవం లేదు. సుప్రీంకోర్టు తీర్పు తరువాత ఒక ఆర్డినెన్స్ ద్వారా కర్ణాటక రాష్ట్రం బిసి రిజర్వేషన్లను 32 శాతానికి తగ్గించుకొని 50 శాతం సీలింగు పాటించింది. కర్ణాటక రాష్ట్రం దగ్గర సాధికార గణాంకాలు లేవనడంగాని అందుచేతే వారి రిజర్వేషన్లను కోర్టు కొట్టేసింది అనడం గాని రెండూ వాస్తవం కాదు. 50% సీలింగు రూలుకి బిసిల జనాధిక్యతతో సంబంధంలేదు.

మే 11, 2010న ఇవ్వబడిన సుప్రీంకోర్టు తీర్పు సుమారు 16 సంవత్సరాల క్రితం 1994, 1995 లలో కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌ల నుండి దాఖలైన రిట్ పిటిషన్లకు సంబంధించినది. నాటి ఈ దేశ ప్రధాన న్యాయమూర్తి కే.జి. బాలకృష్ణన్‌తో బాటు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనం తరుపున తీర్పు రాసింది ప్రధాన న్యాయమూర్తి కే.జి. బాలకృష్ణనే. ఈ తీర్పు ఇచ్చిన మరునాడే అనగా 12.5.2010న ప్రధాన న్యాయమూర్తి కే.జి. బాలకృష్ణన్ పదవీవిరమణ చేయడం, ఆయన ఎస్సీ వర్గానికి చెందిన వారు కావడం గమనించదగ్గ వాస్తవాలు. పదవీ విరమణ తరువాత జాతీయ మానవ హక్కుల కమీషన్ ఛైర్మెన్ పదవీ బాధ్యతలు స్వీకరించడం దరిమిలా, బంధువుల అక్రమ సంపాదన వివాద సందర్భంగా ఆయన తరచుగా వార్తలకెక్కడం పాఠకులకు విదితమే.

సంచాయితీ రాజ్ సంస్థల్లో ప్రాతినిధ్యస్థాయి, ఎసెంబ్లీ, పార్లమెంట్లలో స్థానం సంపాదించడానికి పునాదులవుతాయనేది ఒక వాస్తవం. పంచాయితీరాజ్ చట్టం 1994 క్రింద రాష్ట్రంలో ఇంతవరకు 1995, 2001, 2006లలో మూడుసార్లు ఎలక్షన్లు జరిగాయి. అయితే ఆధిపత్య శక్తుల కుట్రకారణంగా బిసిలకు ఈ మూడు ఎలక్షన్లలో తీవ్రస్థాయిలో అన్యాయం జరిగింది. వారికి చెందవలసిన రిజర్వేషన్ అవకాశాల్లో కొంత భాగాన్ని అగ్రకులాలవారు నొక్కేసారు. ఉదాహరణకు 34 శాతం మేర తమకు చెందవలసిన 373 మండల ప్రజా పరిషత్తు అధ్యక్ష పదవుల్లో 167 పదవుల్ని, 373 ఎం.పి.టి.సి. సీట్లలో 106 సీట్లను 2006 ఎలక్షన్లలో బిసిలు కోల్పోయారు. పూర్తి వివరాలు ఈ రచయిత ప్రివ్యూతో గత నెలలో వెలువడిన కె.వి. సత్యనారాయణ రాసిన పుస్తకంలో ఉన్నాయి.

రిజర్వేషన్ల అమలులో తీవ్రస్థాయిలో జరుగుతున్న ఈ అన్యాయాలకు తోడు ఇపుడు సుప్రీంకోర్టు నిర్దేశించిన 50% సీలింగు సూత్రం ఓపేన్ కేటగిరిలో కూడా 33.3 నుండి 50 శాతానికి ప్రభుత్వం పెంచిన మహిళా రిజర్వేషన్లు సంయుక్తంగా బిసిల రాజకీయ ప్రగతికి గండి కొడుతూ, అగ్రకులాల ఆధిపత్యానికి కొత్త మెట్లు సృష్టిస్తున్నాయి. పైగా పాలకపక్ష ఓటుబ్యాంకు రాజకీయాల కారణంగా పద్ధతికి విరుద్ధంగా చట్టాన్ని గాలకొదిలేసిన బిసి కమీషన్ సహకారంతో కొన్ని ముస్లిం గ్రూపులతో సహా పుంఖానుపుంఖాలుగా బిసి జాబితాలో ఈ మధ్యే చేరిపోయిన దాదాపు 50 అభివృద్ధి చెందిన కులాలు, వర్గాలు; చేరడం ఖాయంగా కనిపిస్తున్న కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలు బిసిలకు మూలిగే నక్కమీద తాటి పండు చందం కావడం ఖాయం.

విద్య, ఉద్యోగ రంగ రిజర్వేషన్లకు 50% సీలింగుని ఖాయం చేసిన సుప్రీంకోర్టు తీర్పు 16-11-1992న ఇంద్రసాహ్ని (మండల్) కేసులో వెలువడింది. ఈ కేసులో మెజారిటీ తీర్పును రాసింది న్యాయమూర్తి జీవన్ రెడ్డి. 50% రిజర్వేషన్ సీలింగుని సమర్థించుకోడానికి రిజర్వేషన్లు తక్కువ సీట్లకే పరిమితం కావడం తన అభిప్రాయంగా,

www.bctimes.org

డాక్టర్ అంబేడ్కర్ 30-11-1948న రాజ్యాంగ చట్ట సభలో చేసిన ఉపన్యాసాన్ని తన తీర్పులో ఆయన ఉటంకించడం గమనార్హం. ఆ విధంగా ఏ రిజర్వేషన్ 50% సీలింగు కారణంగా విద్య, ఉద్యోగ రంగ అవకాశాల్లో తమకు న్యాయంగా చెందవలసిన దాంట్లో సగానికే బిసిలు పరిమితం కావల్సివస్తుందో దానికి డాక్టరు అంబేడ్కర్ అభిప్రాయం పునాదిగా తోడ్పడగా పంచాయితీరాజ్ సంస్థల రిజర్వేషన్లలో ఎస్సీలు, ఎస్టీలు, మహిళలు కూడా వారి వారి జనాభా దామాషా మేరకు పొందుచుండగా 57.1 శాతం జనాభా కలిగిన బిసిలు మాత్రమే దామాషా అవకాశాలకు దూరమైపోయి గత 15 సంవత్సరాలుగా వారికి కేటాయించిన 34 శాతం కూడా కాక 23.45 శాతం రిజర్వేషన్లకే వారు పరిమితం కావలసిన పరిస్థితికి మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి కె.జి. బాలకృష్ణన్ రాసిన సుప్రీంకోర్టు తీర్పు కారణమవుతుంది.

రాజ్యాంగ సవరణకు కారకులైన పార్లమెంట్ సభ్యులు వారి మనుగడకు బిసిల ఓట్లు మీద ఆధారపడవలసిన పరిస్థితి. న్యాయ వ్యవస్థలోని న్యాయమూర్తుల పదవులు దక్కించుకోవడానికి బిసిల ఓట్లతో సంబంధం లేదు. అందుచేత రాజ్యాంగ నిర్మాణంగాని వాటి సవరణగాని పూర్తిస్థాయిలో బిసిల అభివృద్ధిని వ్యతిరేకిస్తున్నట్లు పైకి కనిపించవు. అయితే కోర్టు తీర్పుల ద్వారా బిసిల అభివృద్ధికి, సాధికారతకు గండి కొట్టడానికి మాత్రం సావకాశం కల్పిస్తున్నాయి. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో ఆర్టికల్ 243డి(6)లోనున్న ఇటువంటి సావకాశం ద్వారానే బిసిల ఓట్లతో పనిలేని న్యాయమూర్తుల తీర్పుద్వారా బిసిల దామాషా హక్కులకు తద్వారా వారి సాధికారతకు మాత్రమే గండి పడుతున్నది. ఎస్సీలు, ఎస్టీలు, మహిళలు పూర్తి స్థాయిలో వారి దామాషా హక్కులు పొందగలుగుతున్నారు. బిసిల్ని అణగదొక్కటంలో ఇటువంటి కుట్రపూరిత వ్యవహారింపుతో అగ్రకుల ఆధిపత్య శక్తులు సఫలీకృతం కాగలుగుతున్నాయి.

ఈ మొత్తం వాతావరణాన్ని విశ్లేషించుకుంటే, బిసిల సాధికారతను నిర్వీర్యం చేస్తున్న కీలక సమస్య అర్థమవుతుంది. సూత్ర ప్రాయ సమానత్వం కాకుండా "వాస్తవ సమానత్వం" రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో కీలక భాగం. ఈ అమూల్య రాజ్యాంగ లక్ష్యసాధన, రాజ్యంలో కీలక భాగాలైన న్యాయవ్యవస్థ మీద, చట్ట సభల వ్యవస్థమీద, కార్యనిర్వాహక వ్యవస్థమీద వారి వారి అధికార పరిధుల మేరకు సమస్థాయిలో ఉన్నా బిసిల దామాషా అవకాశాల సాధనలో వాస్తవాలు నిరూపిస్తున్న వైఫల్యానికి ఈ మూడు వ్యవస్థలు సమిష్టిగా బాధ్యులే. ఈ వైఫల్యం, బిసిల అవకాశాలకు సంబంధించిన రాజ్యాంగ సూత్రాల నిర్మాణానికి సంబంధించినది కావచ్చు. ఆ సూత్రాలకు భాష్యం చెప్పే కోర్టు తీర్పులకు సంబంధించినది కావచ్చు. లేక చట్టాలను అమలు చేసే కార్యనిర్వాహక వ్యవస్థదీ కావచ్చు. లేక సమిష్టిగా ఈ మూడుకావచ్చు. గత ఆరు దశాబ్దాలుగా కీలక రంగాలన్నిటిలో బిసిలు తమ దామాషా అవకాశాలు పొందలేకపోవడం వెనుక ఈ వ్యవస్థల్లోని ఆధిపత్య శక్తుల కుట్రపూరిత వ్యవహారింపు నిక్షిప్తమై ఉన్నదనేది పచ్చి నిజం. బిసిల అభివృద్ధికి కళ్ళెం వేయడంలో ఇతరశక్తుల సహకార పాత్ర ఉంటే ఉండవచ్చుగాక అది అప్రధానం. అధికారంలో ఉంటున్న ఆధిపత్య శక్తులపైనే బిసిల సాధికారత బాధ్యత ప్రముఖంగా ఉంటుంది.

ఎస్సీ ఎస్టీ, వర్గాల హక్కుల్ని పూర్తిస్థాయిలో వారికి అందించడం ద్వారా వారి సాధికారతకు సహకరించడం వరకు రాజీ పడగలిగిన ఈ శక్తుల వైఖరి, బిసిల దామాషా హక్కుల విషయంలో ఇంకా ప్రజాస్వామీకరణ చెందవలసి ఉంది. అధిక సంఖ్యాకులైన బిసిల పూర్తిస్థాయి అభివృద్ధి తమ ఆధిపత్యానికి ముప్పు అనే స్వార్థ వైఖరే దీనికి అడ్డం వస్తున్నది. అందుకే రాజ్యం బిసిలను తొక్కిపెడుతున్నది. బిసిలు దామాషా హక్కులు పొందలేని స్థితికి నిత్యం ఆధిపత్య శక్తుల్ని తప్పుపట్టడం వరకు మాత్రమే పరిమితం కావడం సమంజసం కాకపోవచ్చు. రాజకీయాల్లోని, సామాజిక ఉద్యమాల్లోని బిసి నాయకత్వ వైఫల్యాన్ని సమీక్షించుకొని సరిచేసుకోవడం కూడ ప్రాథమిక అవసరం. ఉద్యమ వ్యాపారుల ద్వారా బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీసి నిరోధించే స్థాయికి బిసి జనాలు చైతన్యం కావాలి. సమస్యలమీద, వాటి పరిష్కార మార్గాల మీద స్పష్టమైన అవగాహన కలిగిన మేధోపునాదులపై ఈ ఉద్యమాన్ని, నిస్వార్థ నాయకత్వాన్ని నిర్మించుకోగలిగినపుడు మాత్రమే రాజకీయ రంగంతోబాటు అన్ని కీలక రంగాల్లో బిసిలకు న్యాయం జరుగుతుంది.

**గమనిక: ఇది 11-6-2011 నాటి సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వ్యాసం పూర్తి పాఠం**

www.bctimes.org